సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్తీక లగ్గాలకు సమయం వచ్చేస్తుంది. మరికొద్ది రోజుల్లో పెళ్లి బాజాలు మోగనున్నాయి. దీపావళి తర్వాత దండలు మార్చుకోవడానికి నూతన దంపతులు సిద్ధమవుతున్నారు. పెళ్లి భాజాభజంత్రీలతో, బంధుమిత్రులతో కల్యాణ మండపాలు కళకళలాడనున్నాయి. రెండునెలల తర్వాత మళ్లీ మంచి ముహూర్తాలకు సమయం కలిసి వచ్చింది. క్రోధి నామ సంవత్సరం శ్రావణమాసంలో ఆగస్టు 28 నుంచి మంచి ముహూర్తాలు లేవు. శ్రావణం తర్వాత వచ్చిన భాద్రపద మాసం శూన్యమాసంగా పరిగణించారు. దీంతో భాద్రపదమాసంలో ఎలాంటి ముహూర్తాలు లేవని ఆగమశాస్త్ర పండితులు చెబుతున్నారు. ఆ తర్వాత ఆశ్వీయుజ మాసంలో నిశ్చయ తాంబులాలకు ముహూర్తాలున్నప్పటికీ పెళ్లిలకు ముహూర్తపు తేదీలు లేవు. ఇప్పటికే విజయ దశమి తర్వాత గృహారంబాలు, గృహ ప్రవేశాలున్నా వివాహ ముహూర్తాలు లేవు. ఈ నెల 31న దీపావళి తర్వాత కార్తీకమాసం ప్రారంభమవుతుంది. ఈ మాసంలో కార్తీక లగ్గాలతో మొదలై మార్చిలో వచ్చే మాఘమాసం వివాహాల వరకు పెళ్లి ముహూర్తాలున్నాయని ప్రముఖ జ్యోతిష, ఆగమశాస్త్ర పండితుడు ఆచార్య సంకేత శర్మ చెబుతున్నారు. అయితే సంక్రాంతి సమయంలో కొద్దిరోజులు ముహర్తాలు లేకున్నా మాఘమం వరకు ముహూర్తాలకు ఇబ్బందిలేదని చెబుతున్నారు. కార్తీక మాసంలో నవంబరు 3 నుంచి మొదలుకొని 20 నవంబరు వరకు.. మళ్లీ డిసెంబరు 4 నుంచి 25 వరకు వివాహ, శుభ ముహూర్తాలు ఉన్నాయి. డిసెంబరు 25 నుంచి సంక్రాంతి వరకు ముహూర్తాలు లేవు. సంక్రాంతి నిలబెట్టుట అనే ఆచారం వలన ఈ సమయంలో ఎలాంటి శుభ కార్యక్రమాలు ప్రారంభించరు. ఆ తర్వాత మాఘమాసంలో నూతన సంవత్సరం 2025 జనవరి 31 నుంచి వరుసగా పాల్గుణ మాసం వరకు అంటే మార్చి 6వ తేదీ 2025 వరకు శుభ ముహూర్తాలున్నాయి.

రానున్న శుభ ముహూర్తాలివే

రానున్న కార్తీక మాసంతో మొదలయ్యే శుభ ముహూర్తాలు ఉగాది వరకు ఉంటాయి. జనవరిలో వచ్చే సంక్రాంతి సమయంలో కొద్దిరోజులు ముహూర్తాలు లేకున్నా వచ్చే ఏడాది మార్చి వరకు 5 నెలలు శుభ ముహూర్తాలు అందుబాటులో ఉంటాయి. ఈ ముహూర్తాల్లో శుభకార్యాలు నిర్వహించుకునేందుకు ఎంతోమంది సిద్ధంగా ఉన్నారు. కార్తీకమాసం నవంబరు 3, 7, 8, 10, 13, 14, 17, 20 తేదీల్లో శుభముహుర్తాలున్నాయి. ఆ తర్వాత మార్గశిర మాసం డిసెంబరు 4, 5, 6, 11, 20, 25 తేదీల్లో ముహూర్త బలం ఉంది. ఆ తర్వాత వచ్చే ఏడాది 2025వ సంవత్సరంలో మాఘ మాసం వివాహాల్లో జనవరి 31 నుంచి మొదలుకొని ఫిబ్రవరి 2, 7, 8, 13, 14, 16, 20, 22, 23 తేదీల్లో మంచి ముహూర్తాలున్నాయి. అనంతరం పాల్గుణ మాసం మార్చిలో 2, 6 తేదీల్లో శుభ ముహూర్తాలున్నాయి. ఉగాది తర్వాత నూతన పంచాంగం అనుసరించి శుభ ముహూర్తాలు నిర్ణయిస్తారు.

హల్దీవాగు నుంచి నీటి తరలింపు

● ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని రైతుల ఆందోళన

● ఆర్డీవో, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు



తూప్రాన్ ఆర్డీవోకు ఫిర్యాదు చేస్తున్న రైతులు

తూప్రాన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణం, కిష్టాపూర్ గ్రామాల మధ్య ఉన్న హల్దీవాగు నుంచి నీటిని అక్రమంగా తరలిస్తున్నారని రైతులు ఆరోపించారు. ఈ విషయమై శనివారం తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, ఇరిగేషన్ ఏఈ అరుణ, డిప్యూటీ తహసీల్దార్ ప్రభుదాస్‌కు ఫిర్యాదు చేశారు. తూప్రాన్ మండలం యావాపూర్ శివారులో సుమారు 90 ఎకరాల ప్రభుత్వ భూమిని మల్లారెడ్డి అనే వ్యక్తి లీజు, కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. హల్దీవాగు నుంచి కిష్టాపూర్ మార్గంలో అక్రమంగా భారీ పైపులైన్ వేసుకుంటున్నట్లు వివరిస్తూ.. 40 హెచ్‌పీ భారీ మోటార్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. నీటిని అక్రమంగా తరలించడంతో సుమారు 200 మంది సమీప రైతులు రోడ్డు పడతారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అడ్డు తెలిపితే మల్లారెడ్డి కేసీఆర్, కన్నారావు పేర్లు చెబుతూ బెదిరింపులకు గురిచేస్తున్నారని వివరించారు. మల్లారెడ్డి నుంచి రైతులకు ప్రాణభయం ఉన్నదని ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారులు స్పందించి వారిపై వాల్టా చట్టం ప్రకారం చర్యలు తీసుకుని న్యాయం చేయాలని రైతులు కోరారు.

సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ సందర్శన

నారాయణఖేడ్, అక్టోబరు 26. (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని మణికొండ పురపాలక పరిధిలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌ను సంగారెడ్డి జిల్లాలోని సంగారెడ్డి, నారాయణఖేడ్, తెల్లాపూర్, జహీరాబాద్‌తో పాటు వికారాబాద్ పురపాలక సంఘాల కమిషనర్లు, పారిశుధ్య కార్మికులు శనివారం సందర్శించారు. చెత్త వ్యర్థాలు, వివిధ వాటి తయారీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ కమిషనర్ జగ్జీవన్, పారిశుధ్య విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.



మల్లికార్జున్‌ఖర్గేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ సురేష్‌షెట్కార్

మల్లికార్జున్‌ఖర్గేను కలిసిన ఎంపీ

నారాయణఖేడ్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ అధ్యక్షుడిగా మల్లికార్జున్‌ఖర్గే బాధ్యతలను చేపట్టి రెండేళ్ల పూర్తయిన సందర్భంగా జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ శనివారం మల్లికార్జున్‌ఖర్గేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఎంపీ మాణిక్యంఠాగూర్‌తో ఢిల్లీకి వెళ్లి ఖర్గేను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మల్లికార్జున్‌ఖర్గే నతృత్వంలో పార్టీ మరింత బలపడుతుందని ఆకాంక్షించారు.

64 మంది టీచర్ల డిప్యూటేషన్లు రద్దు

● కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈవో ఉత్తర్వులు

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో 64 మంది టీచర్ల డిప్యూటేషన్లు, వర్క్ ఆర్డర్లు రద్దు చేస్తూ డీఈవో వెంకటేశ్వర్లు శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల డీఎస్సీ ద్వారా పాఠశాలలకు కొత్త ఉపాధ్యాయులు నియమితులైన నేపథ్యంలో సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశాల మేరకు డీఈవో డిప్యూటేషన్లు, వర్క్ ఆర్డర్లు రద్దు చేస్తూ ఉత్తర్వులు వెలువరించారు. వాస్తవానికి ఏ మండలంలోని టీచర్లను ఆ మండలాల్లోనే డిప్యూటేషన్లు, వర్క్ ఆర్డర్లు ఇవ్వాలి, అలా కాకుండా నిబంధనలకు విరుద్ధంగా ఇతర మండలాలకు టీచర్లను తాత్కాలిక సర్దుబాటు చేయడంతో ఈ మేరకు చర్యలకు ఉపక్రమించనట్లు తెలిసింది.

అక్రమంగా మట్టి తరలింపు

● 10 టిప్పర్లు, ఐదు ఎక్స్‌కవేటర్లు స్వాధీనం



పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న టిప్పర్లు

మనోహరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్న పది టిప్పర్లను, ఐదు ఎక్స్‌కవేటర్లను స్వాధీనం చేసుకుని ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు తూప్రాన్ సీఐ రంగకృష్ణ తెలిపారు. మనోహరాబాద్ మండలం కొండాపూర్, ముప్పిరెడ్డిపల్లి గ్రామ శివారులోని టీజీఐఐసీ పారిశ్రామికవాడలో శుక్రవారం రాత్రి కొంతమంది అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నారన్న సమాచారం మేరకు సీఐ రంగకృష్ణ తన సిబ్బందితో కలిసి టిప్పర్లను పట్టుకున్నామని తెలిపారు. పట్టుకున్న పది టిప్పర్లను, ఐదు ఎక్స్‌కవేటర్లను మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కళ తప్పిన కళాశాల

● నిరుపయోగంగా రాష్ట్ర హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల



నిరుపయోగంగా రాష్ట్రస్థాయి హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల

కోహీర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) 'రాజుల సైసా రాళ్లపాలు' అన్నట్లు రూ.12 కోట్ల ప్రజాధనంతో నిర్మించిన రాష్ట్రస్థాయి హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల నేడు ప్రజాప్రతినిధుల, అధికారుల నిర్లక్ష్యం మూలంగా పాడుబడిపోతుంది. గ్రామీణ పేద విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సు అందించి వారికి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో 2012లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి జే.గీతారెడ్డి కృషితో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో రూ.12 కోట్లు వెచ్చించి సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని కవేలి చౌరస్తా వద్ద రాష్ట్రస్థాయి హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కళాశాల నిర్మాణం పూర్తయినంత వరకు వృత్తి విద్యా కోర్సుపై ఆసక్తి ఉన్న విద్యార్థుల నుంచి దరఖాస్తుల స్వీకరించి తాత్కాలిక భవనంలో తరగతులు నిర్వహించారు. కాంట్రాక్టు నిర్లక్ష్యంతో కళాశాల నిర్మాణంలో ఆలస్యమైనా ఎట్టకేలకు 2017లో నిర్మాణం పూర్తయింది. 2017లో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం కళాశాల ప్రారంభానికి ఏర్పాట్లు చేసింది. 2017 ఆగస్టు 3న అప్పటి ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. అనంతరం జాతీయస్థాయిలో పోటీ పరీక్షలు నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేసిఈ కళాశాలలో డిగ్రీ తరగతులను నిర్వహించారు. మూడేళ్ల పాటు కళాశాల మంచిగా కొనసాగింది. అయితే కరోనా కారణంగా విద్యార్థులు కళాశాలను విడిచి వెళ్లడంతో నాటి నుంచి నేటివరకూ ప్రవేశాలు లేకపోవడంతో కళాశాల కళ తప్పి రోజురోజుకూ పాడుబడిపోతోంది.



జారిపడిన వ్యక్తిని బయటకు తీస్తున్న భక్తులు

జారిపడితే నాకేంటి..

● ఏడుపాయలలో ఈవో వింత వైఖరి

పాపన్నపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలతో ఏడుపాయల లో కొన్ని ప్రాంతాల్లో వరదల మూలంగా పాకూరు పట్టి భక్తులు జారిపడుతున్నా ఈవో పట్టించుకోవడం లేదని భక్తులు ఆరోపిస్తున్నారు. ఏడుపాయల ఈవో కార్యాలయం ఎదుట వరద మూలంగా మొత్తం పాకూరు పట్టింది. అక్కడ నీటిలో కాళ్ల కడుక్కుందామని శనివారం ఉదయం వెళ్లిన చాలామంది భక్తులు జారిపడ్డారు. పది గజాల దూరంలో ఉండి కూడా ఈవో చర్యలు చేపట్టలేదు. ఉదయం నుంచి చాలామంది భక్తులు జారిపడి గాయాల పాలయ్యారు. అక్కడ పాకూరు తొలగించే ప్రయత్నం చేయకపోవగా, బారికేడ్లు ఏర్పాటు చేయలేదు. చాలామంది సెక్యూరిటీ సిబ్బంది ఉన్నా.. అక్క ఒక్కరిని కూడా నియమించకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈవో కార్యాలయం ఎదురుగానే ఇంత ఘోరం జరిగినా ఆయన కనీసం పట్టించుకోకపోవడం.. ఈవో తీరుపట్ల భక్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నోటిఫికేషన్లు ఆపి నిరుద్యోగులను మోసం చేయొద్దు

● ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి చైర్మన్ చెన్నయ్య



సంగారెడ్డికి చేరుకున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి యాత్ర

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ నోటిఫికేషన్లు ఆపి నిరుద్యోగులను మోసం చేయొద్దని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి చైర్మన్ జి.చెన్నయ్య సూచించారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి బస్సుయాత్రలో భాగంగా 9వ రోజు శనివారం సంగారెడ్డికి చేరింది. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ భవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో చెన్నయ్య మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా వచ్చేనెల 24న హైదరాబాద్‌లో జరిగే సభను జయప్రదం చేయాలని కోరారు. మాలలకు వ్యతిరేకంగా జరుగుతున్న కుట్రలను గ్రామాల్లో చర్చపెట్టి ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కో చైర్మన్లు వెంకటేశ్వర్లు, రవి, రాంచందర్, రమేశ్, నరసింహయ్య, లింగస్వామి, బాలకిషన్, వెంకన్న, అనిల్, జిల్లా అధ్యక్షుడు మల్లేశం, ఉపాధ్యక్షులు అశోక్, జనార్ధన్; అనంతయ్య పాల్గొన్నారు.

మిన్‌పూర్‌లో కొనసాగుతున్న పోలీసు పికెటింగ్

పుల్‌కల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిన్‌పూర్‌లో చెరువులు, కుంటల వాటా విషయమై ముదిరాజ్‌లు, ఇతర కులాలకు మధ్య తలెత్తిన వివాదంతో ఏర్పడిన ఉద్రిక్తత దృష్ట్యా ఏర్పాటుచేసిన పోలీసు పికెటింగ్ కొనసాగుతున్నది. గ్రామంలోని చెరువులు, కుంటల్లో చేపలు పట్టుకునే విషయమై జూన్‌లో ముదిరాజ్‌లు, ఇతర కులాలకు మధ్య వివాదం ఏర్పడి ఘర్షణ పడ్డారు. ముదిరాజ్‌లు ఒక వర్గంగా, గ్రామంలోని మిగిలిన కులాల వారు మరో వర్గంగా ఏర్పడ్డారు. ప్రజల మధ్య నెలకొన్న మనస్పర్ధలను తొలగించేందుకు రెవెన్యూ, పోలీసు, మత్స్యశాఖ అధికారులు 21న గ్రామసభ నిర్వహించిన విషయం తెలిసిందే. ఉద్రిక్త పరిస్థితులు ఉత్పన్నమవడంతో జిల్లా పోలీసు ఉన్నతాధికారుల సూచనల మేరకు పోలీసులతో పికెటింగ్‌ను ఏర్పాటుచేశారు. సాధారణ పరిస్థితులు వచ్చేవరకు పికెటింగ్ కొనసాగుతుందని పుల్కల్ ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ తెలిపారు. ఇప్పుడిప్పుడే సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు.

'అంతుచిక్కని' విద్యార్థినుల అస్వస్థత

● శ్వాసకోశ సమస్యలు, దగ్గుతో సతమతం

● పిడియాట్రిక్ డాక్టర్ బృందంతో మెరుగైన వైద్యం

● సంగారెడ్డి ఎంసీహెచ్‌లో తొమ్మిది మందికి చికిత్స

● దగ్గరుండి పర్యవేక్షిస్తున్న డీఈవో, సూపరింటెండెంట్



జహీరాబాద్ పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో తీవ్ర దగ్గు, శ్వాస ఇక్కట్లతో పలువురు విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. అయితే శనివారం జహీరాబాద్ ఏరియా ఆస్పత్రి నుంచి తొమ్మిదిమందిని హుటాహుటిన సంగారెడ్డిలోని ఎంసీహెచ్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. పీడియాట్రిక్ ఐసీయూలో చేర్చినవారిని పీడియాట్రిక్ డాక్టర్ల బృందంతో చికిత్స ప్రారంభించారు. ప్రతి విద్యార్థినీ రక్త నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపారు. ప్రతి ఒక్కరికి నిరంతరం ముక్కు ద్వారా ఆక్సిజన్ అందిస్తూ శ్వాస ఇక్కట్లను అదుపు చేసే చర్యలు తీసుకున్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.జి.అనిల్‌కుమార్ దగ్గరుండి బాలికలకు వైద్యమందిస్తున్నారు. కాగా అస్వస్థతకు గురైన విద్యార్థినులను డీఈవో ఎస్.వెంకటేశ్వర్లు పరామర్శించారు. బాలికల ఆరోగ్య పరిస్థితిని ఇరువురు అధికారులు ఎప్పటికప్పుడు కలెక్టర్ వల్లూరు క్రాంతికి సమాచారం అందించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.అనిల్‌కుమార్ మాట్లాడుతూ దగ్గు, శ్వాస సమస్యలతో ఇక్కడికి వచ్చారని, ఒకరిద్దరికి దమ్ము ఎక్కువగా వస్తుందని, మిగతా వారందరి ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. ప్రాణాపాయం ఏమీ లేదని స్పష్టం చేశారు.

అంతుచిక్కని కారణం

కేజీబీవీ విద్యార్థినులు అస్వస్థత ఎందుకు గురయ్యారనే కారణం మాత్రం అంతుచిక్కడం లేదు. ఫుడ్ పాయిజన్ కాలేదు, తాగునీరు కలుషితం కాలేదు. 191 మంది ఉన్న ఆ విద్యాలయంలో 11 మందికే శ్వాస సమస్యలు, దగ్గు రావడం ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు కేజీబీవీ భవనానికి సీఎస్‌ఆర్ కింద మహీంద్ర కంపెనీ రంగులు వేస్తున్నది. ఆ వాసనతో బాలికలు అస్వస్థతకు గురైనట్లు కొందరు భావిస్తున్నారు. మూడునెలల క్రితం కూడా భవనానికి రంగులు వేశారని అప్పుడు మాత్రం ఎవరికీ ఏమీ కాలేదని, కానీ ఇప్పుడు అస్వస్థతకు కారణం అదే అని చెప్పలేకపోతున్నామని అధికారులు, ఉపాధ్యాయులు అంటున్నారు. జీజీహెచ్-ఎంసీహెచ్ డాక్టర్లు కూడా అస్వస్థతకు గల కారణాలు స్పష్టంగా చెప్పలేకపోవడం కొంత ఆందోళనకు గురి చేస్తున్నది.

తగ్గని వ్యాధితీవ్రత

జహీరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో గల కస్తూర్బా బాలికల విద్యాలయంలో ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురై శుక్రవారం జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రిలో చేరిన విద్యార్థినులకు వ్యాధి తీవ్రత తగ్గలేదు. అయితే శుక్రవారం ఆస్పత్రిలో 11 మంది విద్యార్థినులు వైద్యం నిమిత్తం చేరారు. అందులో ఐదుగురిని సాయంత్రం డిశ్చార్జ్ చేశారు. శనివారం తెల్లవారుజామున డిశ్చార్జ్ విద్యార్థినులు మళ్లీ దగ్గుతుండడంతో తల్లిదండ్రులు భయంతో హుటాహుటిన జహీరాబాద్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఉదయం నుంచి రాత్రివరకు వైద్యులు చికిత్సలు చేశారు. ఆస్పత్రిలో విద్యార్థులకు, రోగులకు మెరుగైన వైద్యమందించడంలో వైద్య సిబ్బంది విఫలమయ్యారని గిరిజన సంఘం నాయకులు సంజీవ్, హీరురాథోడ్, విజయ్ తదితరులు ఆరోపించారు. విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయాన్ని తెలుసుకుని శనివారం ఆస్పత్రికి వచ్చి విద్యార్థినులకు అందుతున్న వైద్యం గురించి ఆరాతీశారు. మెరుగైన వైద్యమందించకపోతే ఆందోళనలను చేస్తామని హెచ్చరించారు.

మైనర్ డ్రైవింగ్ చట్టరీత్యా నేరం

● గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి

గజ్వేల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మైనర్ డ్రైవింగ్ చట్టరీత్యా నేరమని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నియమనిబంధనలు రోడ్డు భద్రతను గురించి శనివారం వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలు బాగుపడితే తల్లిదండ్రులకు అంతకుమించిన ఆనందం ఇంకొటి ఉండదని తెలిపారు. తల్లిదండ్రుల కష్టాన్ని దృష్టిలో ఉంచుకుని ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని చదవాలని సూచించారు. ఆయనవెంట కళాశాల ప్రిన్సిపాల్ శ్రావణ్ కుమార్, షీ టీం సిబ్బంది శ్రీరాములు, శ్యామల, లావణ్య, మహేష్, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

సిద్దిపేట రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని తోర్నాల శివారులో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి దాడి చేసి ఆరుగురు పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అపూర్వరెడ్డి తెలిపారు. విశ్వసనీయ సమాచారంతో దాడి చేసి ఇద్దరు వ్యక్తులు పారిపోగా నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.3,700లు, 5 ద్విచక్రవాహనాలు, 4 సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఆదర్శం.. కిష్టంపేట

● పార్టీల జెండాలు అన్ని పక్కపక్కనే
● దారులు వేరైనా గమ్యం ఒక్కటే.. అభివృద్ధే లక్ష్యంగా ముందుకు
● ప్రత్యేక దినోత్సవాల నాడు ఒకేసారి జెండాల ఆవిష్కరణ

చేర్యాల, అక్టోబరు 26: రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఓ పార్టీపై మరో పార్టీ విషం చిమ్ముకుంటూ, ఒకరి తప్పులు మరొకరు ఎత్తిచూపుకునే రోజులివి. అందుకు పూర్తి భిన్నంగా కొమురవెల్లి మండలం కిష్టంపేట నేతలు అవేమీ తమకుపట్టవని, సఖ్యతే తమ అభిమతమని స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఎవరి సిద్ధాంతాలు వారివైనా, రాజకీయ పార్టీలు వేరే అయినా గ్రామ సమస్యలు పరిష్కరించుకోవడంలో అంతా ఒక్కటేనన్న ఆలోచనతో ముందుకు సాగుతున్నారు. యువత స్థానికుల్లో దేశభక్తిని పెంపొందింపచేయడంతో పాటు రాజకీయాలకతీతంగా కలిసికట్టుగా ఉండాలని తీసుకున్న చర్యలు అందరినీ ఆలోచింపచేస్తున్నాయి.

అన్ని పార్టీలు సమానమే

మాజీ సర్పంచు భీమనపల్లి కరుణాకర్ హయాంలో అన్ని రాజకీయ పార్టీలకు ప్రాధాన్యమిచ్చి గ్రామపంచాయతీ కార్యాలయ సమీపంలోని ప్రధాన చౌరస్తాలో ఒకే ప్రదేశంలో సమాన ఎత్తులో జెండాగద్దెలను నిర్మించారు. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవం వేళ ఒకే సమయంలో ఒకే చోట అందరూ పండగ వాతావరణంలో జాతీయపతాకాన్ని ఎగురవేస్తున్నారు. అంతేకాకుండా జాతీయ నాయకులు గాంధీ, స్వామి వివేకానంద, భగత్‌సింగ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, భగత్‌సింగ్‌ల విగ్రహాలను ఒకే చోట ఏర్పాటు చేశారు. సిద్దిపేట, హైదరాబాద్ తదితర పట్టణాల ఉన్న విధంగా లవ్ కిష్టంపేట అనే సింబల్‌ను కూడా ఏర్పాటు చేయించి, గ్రామ ప్రధాన చౌరస్తాను ఓ వైపు జాతీయ నాయకుల విగ్రహాలు, మరోవైపు రాజకీయ పార్టీ జెండాల గద్దెలను నెలకొల్పి తీర్చిదిద్దారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రామానికి రావడంతోనే అవి స్వాగతం పలుకుతూ తమ ప్రత్యేకతను చాటుతున్నాయి. అంతేకాకుండా ఇతర గ్రామాల నేతలు ' కిష్టంపేట ' ఆలోచనలో పడిపోయారు.



స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఒకేసారి జాతీయపతాకాన్ని ఆవిష్కరిస్తున్న వివిధ పార్టీల నాయకులు(ఫైల్)

కలిసికట్టుగా ఉండాలని..

కలిసికట్టుగా ఉంటే ఏదైనా సాధించవచ్చు. అన్ని రాజకీయ పార్టీలకు సముచితస్థానం కల్పించాలని ఒకే చోట పార్టీజెండాల గద్దెలు నిర్మించాం, జాతీయ నాయకుల విగ్రహాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నాం. దీంట్లో గ్రామస్థుల సహకారం ఎంతో ఉంది.

- భీమనపల్లి కరుణాకర్, కిష్టంపేట

ఆదర్శంగా నిలిచేందుకు దోహదం

పార్టీల మధ్య బేధాభిప్రాయాలు ఉన్నా స్థానికులంతా రాజకీయాలకతీతంగా కలిసిమెలిసి ఉండి ఆదర్శంగా వ్యవహరిస్తున్నారని చాటిచెప్పేందుకు జాతీయ నాయకుల విగ్రహాలు, ఒకేచోట పార్టీ గద్దెల నిర్మాణం ఎంతగానోదోహదపడింది.

- బందెల దుర్గారెడ్డి, కిష్టంపేట

సంక్షేమ పథకాల అమలుపై సమీక్షిస్తాం

● ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



కమిషన్ చైర్మన్‌కు మొక్కను అందజేస్తున్న వినయ్‌కుమార్

గజ్వేల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): దళిత, గిరిజన ప్రత్యేక అభివృద్ధి నిధుల ఖర్చుతో పాటు సంక్షేమ పథకాల అమలుపై త్వరలో సమీక్ష నిర్వహించి అభివృద్ధి ఫలాలు ఎస్సీ, ఎస్టీలకు అందే విధంగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి నిధులపై కమిషన్ సమీక్షించాలని దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్, జాతీయ కార్యదర్శి పి.శంకర్ అధ్వర్యంలో డీబీఎఫ్ బృందం ఆయన్ను కలిసి చర్చించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందించిన రాజ్యాంగ ఫలాలు అణగారిన వర్గాలకు అందేవిధంగా కమిషన్ ప్రయత్నం చేస్తుందన్నారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యులు జిల్లా శంకర్, రాముబాబు నాయక్, ప్రొఫెసర్ తడ్క యాదగిరి, డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ జరిగే వరకు నియామకాలు ఆపాలి

● ఎమ్మార్పీఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ

గజ్వేల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు రాష్ట్రంలో ఉద్యోగ నియామకాల ప్రక్రియను నిలిపివేయాలని ఎమ్మార్పీఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలో శనివారం నిర్వహించిన గజ్వేల్ నియోజకవర్గ ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి ఎస్సీ వర్గీకరణ అమలు చేయడంలో దేశంలోనే తొలి రాష్ట్రంగా తెలంగాణను నిలబెడతామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి మాటను నిలబెట్టుకోవడం లేదన్నారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టకుండా 11వేల టీచర్ పోస్టులు భర్తీ చేసి మాదిగలకు అన్యాయం చేశారన్నారు. ఎస్సీ రిజర్వేషన్ కేటగిరీలోని టీచర్ పోస్టుల్లో 80శాతం పైగా మాలలకే చెందాయన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు కోసం సిద్దిపేటలో మాదిగల ధర్మయుద్ధ సదస్సును ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ హాజరవుతున్నట్లు తెలిపారు. ఆయనవెంట ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీహరి సింధు, ఎమార్పీఎస్ గజ్వేల్ అసెంబ్లీ కన్వీనర్ శనిగారి రమేష్, మండల అధ్యక్షుడు ఉబ్బని అంజనేయులు, చిట్యాల రవీందర్, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

భవనానికి 5 ఎకరాల స్థలాన్ని కేటాయించాలి

● మంత్రికి ముదిరాజ్ సంఘం నాయకుల వినతి

కోహెడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణంలో ముదిరాజ్ కులస్థుల సంఘం భవన నిర్మాణానికి ఐదు ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయించాలని ముదిరాజ్ సంఘం నాయకులు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కలిసి విన్నవించారు. మండలంలోని శనిగరం గ్రామంలో శనివారం చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రిని ముదిరాజ్ సంఘం నాయకులు కలిసి ఐదు ఎకరాల స్థలం కేటాయించి, ఫంక్షన్ హాల్‌తో పాటు కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షుడు సుతారి కనుకరాజు, కోహెడ మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు చామంతుల రాజమల్లయ్య, పిట్టల శ్రీకాంత్, జడగల సతీష్, కొనవేని కిషన్, తేలు యాదగిరి, సంఘం సభ్యులు ఉన్నారు.

సిద్దిపేట.. పర్యాటక తోట

5వ పేజీ తరువాయి..

ఇక్కడున్న నైట్ గ్లో గార్డెన్‌లో జంతువులు తిరుగుతున్నట్లుగా పలు స్క్రీన్‌ల ద్వారా ప్రదర్శన నిర్వహిస్తున్నారు. అవి నిజంగానే తిరుగుతున్నట్లు కనిపించడంతో చిన్నారులు ఉత్సాహంగా గడుపుతున్నారు. చెరువులో వాటర్ బెలూన్ రోలర్, ఆట పరికారాలతో చిన్నారులు కేరింతలు కొడతున్నారు. నైట్ గార్డెన్ ఎదుట ఏర్పాటు చేసిన 360 డిగ్రీల సెల్ఫీ కెమెరాతో చుట్టూ తిరుగుతూ ఉండటంతో సందర్శకులు వీడియోలు తీసుకుంటూ ఇన్‌స్టా, ఫేస్‌బుక్, స్నాప్‌చాట్, వాట్సప్‌లలో పోస్టు చేసుకుంటున్నారు.

వాకింగ్ ట్రాక్.. ఓపెన్ జిమ్..

వ్యాయామదారుల కోసం రూబీ నెక్లెస్ రోడ్డులో వాకింగ్ ట్రాక్, చెరువు కట్టపై ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయడంతో పలువురు ఉదయాన్నే వచ్చి వాకింగ్, జిమ్ చేస్తున్నారు. చెరువు కట్టపై ఏర్పాటు చేసిన యోగా కేంద్రంలో ఎంతో మంది శిక్షణపొందుతూ ఆరోగ్యాన్ని సంరక్షించుకుంటున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు నిత్యం పర్యాటకుల తాకిడితో బిజీగా ఉండే కొమటిచెరువులో ఇసుమంతైనా చెత్త కూడా కనిపించకుండా సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. పర్యాటకులు కూడా చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా, ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్‌లోనే వేస్తుండటంతో చెత్త రహితంగా కనిస్తున్నది.



మిరుమిట్లు గొలుపుతున్న లేజర్ షో

రయ్‌మంటున్న బోట్లు..

కొమటిచెరువు పర్యాటకరంగంగా మారుతున్న క్రమంలో 7 బోట్లను ఏర్పాటు చేశారు. అందులో మూడు రకాల బోట్లుండగా రెండు స్పీడ్ బోట్లు, ఒక లగ్జరీ, 15 మంది వెళ్లే సామర్థ్యం ఉన్న ఒక బోటు, 30 మందికిపైగా వెళ్లే సామర్థ్యం గల బోట్లు ఉన్నాయి. దీంతో సాయంత్రం వేళ చెరువులో రయ్‌రయ్‌మంటూ బోట్లు తిరుగుతుండటంతో పర్యాటకులు కేరింతలు కొడుతూ, సెల్ఫీ ఫొటోలు దిగుతూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అంతరించిపోయిన డైనోసార్లను ప్రత్యక్షంగా ఉన్నట్లుగా భావించేలా రాష్ట్రంలోనే సిద్దిపేటలో ప్రత్యేకంగా డైనోసార్ పార్కును ఏర్పాటు చేశారు. దీంతో ఆ పార్కులో 5 నుంచి 6 మంది పట్టేలా చిన్నపాటి రైలును ఏర్పాటు చేసి, పలు చిన్న, పెద్ద డైనోసార్లను ఏర్పాటు చేశారు. రైలులో వెళ్తున్న సమయంలో చిన్న, పెద్ద డైనోసార్ బొమ్మలు అరుస్తూ ముందుకు వచ్చి కనువిందు చేస్తున్నాయి.



కోమటి చెరువు వద్ద జనసందోహం



సస్పెన్షన్ బ్రిడ్జిపై పర్యాటకుల సందడి

'జీవితానికి రసాయన శాస్త్రంతో విడదీయలేని సంబంధముంది'

వర్గల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జీవితానికి రసాయన శాస్త్రానికి విడదీయలేని సంబంధముందని వర్గల్ మహాత్మా జ్యోతిబాపూలే మహిళా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గోవిందరావు పేర్కొన్నారు. కళాశాలలో శనివారం జాతీయ రసాయన శాస్త్ర వారోత్సవాల సందర్భంగా ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రసాయన శాస్త్ర విశేషాలను వివరించారు. కార్యక్రమంలో రాధ, అధ్యాపక బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం 'సీఎంఆర్ఎఫ్'

సిద్దిపేట టౌన్, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు వరం సీఎం సహాయనిధి అని కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. సిద్దిపేటలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో శనివారం సిద్దిపేట రూరల్ మండలం, తోర్నాల గ్రామానికి చెందిన కొర్తివాడ ధరణి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న హరికృష్ణ ఆమె తండ్రి శ్రీకాంత్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.19వేల ఎల్‌వోసీని అందజేశారు.

రోయింగ్‌లో సిల్వర్ మెడల్

హుస్నాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉత్తర ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో ఈ నెల 25న జరిగిన సబ్ జూనియర్ నేషనల్ రోయింగ్ అండర్ 15 విభాగం డబుల్స్ హుస్నాబాద్ పట్టణానికి చెందిన కాశబోయిన అభిజిత్ యాదవ్ సిల్వర్ మెడల్ సాధించాడు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

● ఎమ్మెల్సీ యాదవరెడ్డి



తొగుట: లింగాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కుకునూరుపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లోని రైతులు ధాన్యాన్ని విక్రయించాలని ఎమ్మెల్సీ యాదవరెడ్డి సూచించారు. మెదినీపూర్, మాత్‌పల్లి, బొబ్బాయిపల్లి, తిప్పారం గ్రామాల్లో ఐకేపీ మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఏపీఎం మగ్దుం అలి, శ్రీనివాస్‌రెడ్డి, అమరేందర్, శ్రీకాంత్‌రెడ్డి, బచ్చలి మహిపాల్, నరసింహాచారి, కొంతం రాజు, వివిధ గ్రామపంచాయతీ కార్యదర్శి అధికారులు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

● తొగుట: రైతులకు రుణమాఫీ చేయకుండా మోసం చేసింది గత బీఆర్ఎస్ ప్రభుత్వమేనని కాంగ్రెస్ దుబ్బాక నియోజక వర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని ఎల్లారెడ్డిపేట, తుక్కాపూర్, వెంకట్రావ్‌పేట, జప్తి లింగారెడ్డిపల్లి, లింగాపూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు.

● దౌల్తాబాద్: మండల పరిధిలోని శేరిపల్లి మొండిచింత నుంచి బేగంపేట నాచారం వరకు చేపట్టే బీటీ రోడ్డు విస్తరణ నిర్మాణ పనులను కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు.

దూళిమిట: మండలంలోని జాలపల్లిలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కోల సాయిలుగౌడ్, మేక మల్లేషం, జిల్లా నాయకులు జక్కిరెడ్డి సుదర్శన్‌రెడ్డి, చెట్కూరి కమలాకర్‌యాదవ్,మండల ఉపాధ్యక్షుడు బూర గంగాధర్, గ్రామశాఖ అధ్యక్షుడు సాగర్, ఐకేపీ సిబ్బంది తదితరులున్నారు.

మెరుగైన వైద్యసేవలందించాలి

● డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్



మాట్లాడుతున్న డాక్టర్ పుట్ల శ్రీనివాస్

సిద్దిపేట టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని సిద్దిపేట జిల్లా ఆరోగ్యశాఖాధికారి పుట్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. సిద్దిపేటలోని డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో సిద్దిపేట జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అధ్యక్షతన జిల్లాలోని పీహెచ్‌సీ వైద్య అధికారులకు, బస్తీ దవాఖానా, ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారులకు ఆరోగ్య కార్యక్రమాల పనితీరుపై శనివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం అండ్‌హెచ్‌వో డాక్టర్ పుట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆరోగ్య కేంద్రానికి వచ్చిన వారిని ఆప్యాయంగా ఆహ్వానించి, వారికి చికిత్స చేయాలన్నారు. ఆరోగ్య కేంద్రం పరిధిలో ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమైనప్పుడు వెంటనే స్పందించి, ఆరోగ్య సిబ్బందితో ఆ గ్రామానికి వెళ్లి కారణాలు తెలుసుకుని జిల్లా కార్యాలయానికి నివేదికను పంపాలని సూచించారు. వైద్య అధికారులు ప్రతీనెల ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య కార్యక్రమాల పనితీరుపైన సమీక్ష నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటి డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రేవతి, వైద్యులు శ్రీనివాస్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఆనంద్, డాక్టర్ నారాయణరావు, డాక్టర్ శ్రీకళ వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

నత్తల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

చిన్నకోడూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నత్తల నివారణకు రైతులు సామూహికంగా సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వ విద్యాలయం కూరగాయల పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు అనితకుమారి, ప్రీతం, వీర సురేష్, ఉద్యానశాఖ అధికారి రమేష్ సూచించారు. చిన్నకోడూరు మండలం పెద్దకోడూరు శివారులో పలువురు రైతులు సాగు చేసిన కూరగాయాల పంటలకు నత్తలు ఆశించి నష్టం చేస్తుండటంతో 'కూరగాయ పంటను పీల్చేస్తున్నాయ్' అన్న శీర్షికన శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఉద్యానశాఖ అధికారులు స్పందించారు. పంటలను వారు సందర్శించి నత్తల నివారణ చర్యల గురించి రైతులకు వివరించారు.

నత్తల నివారణకు చేపట్టాల్సిన చర్యలు

● నత్త గుల్లలను అన్నిటిని ప్రోగు చేసి ఉప్పు నీళ్లలో వేయాలి



పెద్దకోడూరు శివారులో టమాట పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, హెచ్‌వో

● నత్తలు రాత్రిపూట తిరుగుతాయి కాబట్టి ఉప్పు లేదా సున్నంను పంట చుట్టూ చల్లుకోవాలి.

● క్యాబేజీ లేదా బొప్పాయి ఆకులను పొలంలో వేసినట్లయితే నత్తలు ఎక్కువగా ఆకర్షితమవుతాయి. తర్వాత ఆకులను ఏరి కాల్చివేయాలి

● ఉప్పు నీటిలో నానబెట్టిన గోనె సంచులను పొలంలో అక్కడక్కడ అమర్చుకున్నట్లైతే నత్తలు వాటికీ ఆకర్షితమవుతాయి.

ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

చేర్యాల, అక్టోబరు 26: బెల్టుషాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు స్థానికులు చేర్యాల పట్టణంలోని ఎక్సైజ్ సీఐ కార్యాలయానికి వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లగా, అధికారులెవరూ లేరన్న కారణంగా సిబ్బంది నిరాకరించడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. ఈసందర్భంగా బీసీ సంఘర్షణ సమితి నాయకుడు అంబటి అంజయ్య, కాంగ్రెస్ మైనార్టీ సెల్ నాయకుడు జహూరుద్దీన్, బీసీ సెల్ నాయకుడు బండి శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ.. ఎక్సైజ్ సిబ్బంది తీరుపై మండిపడ్డారు. చేర్యాల పట్టణంతో పాటు పలు గ్రామాలలో పుట్టగొడుగుల్లా బెల్టుషాపులు పుట్టుకొచ్చినా ఎక్సైజ్ అధికారులు చోద్యం చూడడం తగదన్నారు.

పరీక్ష రద్దుతో వెనుదిరిగిన మహిళలు

మద్దూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జాగృతి మహిళా సమాఖ్య కార్యాలయంలో సీఏ పోస్టు పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పి రద్దు చేయడంపై మహిళలు అసహనం వ్యక్తం చేశారు. ఉమ్మడి మండలంలోని కొండాపూర్, హన్మతండాలో ఖాళీగా ఉన్న సీఏ పోస్టు పరీక్షకు మండల కేంద్రంలోని జాగృతి సమాఖ్యలో శనివారం ఏర్పాట్లు చేశారు. కొండాపూర్, హన్మతండా నుంచి పరీక్ష రాసేందుకు ఉదయం 10 గంటలకు వచ్చిన 12 మంది మహిళలు మధ్యాహ్నం 3 గంటల వరకు నిరీక్షించినా పరీక్ష నిర్వహించకపోవడంతో అసహనంతో వెనుదిరిగారు. ఈ విషయమై ఏపీఎం బాబురావు మాట్లాడారు. లింగాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రానికి సంబంధించి భూమి చదును పంచాయతీ వల్ల రాలేక పోయామని, పరీక్ష తేది మళ్లీ ప్రకటిస్తామన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే

హుస్నాబాద్ అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. సీనియర్ విద్యార్థులు ఉత్సాహంగా కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయగిరి బిక్షపతి మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు.

'ఇందూర్'లో హ్యాకథాన్ వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో విద్యార్థులు

సిద్దిపేట అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇందూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో శనివారం హ్యాకథాన్ వర్క్‌షాప్ నిర్వహించి, అంతర్గత పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వీవీ రాజు మాట్లాడుతూ.. హ్యాకథాన్ వర్క్‌షాప్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. అంతర్గత పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బెనర్జీ, కార్యక్రమ సమన్వయకర్త భాగ్యరెడ్డి, పీఆర్వో బొడ్డు రఘు, హెచ్‌వోడీస్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు గజ్వేల్ విద్యార్థి

గజ్వేల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయిలో అండర్-19 ఎస్‌జీఎఫ్ఐ ఫుట్‌బాల్ టీమ్‌కు గజ్వేల్ సెయింట్ పీటర్ స్కూల్ 10వ తరగతి విద్యార్థి, గజ్వేల్ ఫుట్‌బాల్ అసోసియేషన్ క్రీడాకారుడు శశాంత్ ఎంపికయ్యాడు. వచ్చే నెల సంగారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 సిద్దిపేట జిల్లా సెక్రెటరి సమ్మయ్య, గజ్వేల్ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగిశెట్టి రవీందర్ తెలిపారు.

పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుందాం

● గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి

గజ్వేల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుందామని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట శనివారం ఉదయం నిర్వహించిన సైకిల్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. పోలీసు అమరుల త్యాగాలను ప్రజలకు తెలియజేయాలన్న ఉద్దేశంతో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయనవెంట గజ్వేల్ సీఐ సైదా, అదనపు సీఐ ముత్యంరాజు, ట్రాఫిక్ సీఐ మురళి, తొగుట సీఐ లతీఫ్, గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్ఐలు దామోదర్, శ్రీనివాస్, కర్ణాకర్‌రెడ్డి, చంద్రమోహన్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

● సిద్దిపేట క్రైం: పెద్దకోడూర్ గ్రామ శివారులో ఉన్న సీఏఆర్ హెడ్‌క్వార్టర్‌లో జిల్లాలోని సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్, సిబ్బందికి వీక్లీ పరేడ్ నిర్వహించారు. ఏఆర్ అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్ సిబ్బంది ప్రదర్శించిన ఆర్మ్స్ డ్రిల్, స్క్వాడ్ డ్రిల్‌ను పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, ధరణికుమార్, రాజేష్, విష్ణుప్రసాద్, ఇన్‌స్పెక్టర్లు వాసుదేవరావు, విద్యాసాగర్, ఉపేందర్, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పోలీస్ సిబ్బంది, ఏఆర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేట క్రైం : పరేడ్‌ను వీక్షిస్తున్న అదనపు డీసీపీ

● హుస్నాబాద్: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా హుస్నాబాద్‌లో హుస్నాబాద్ ఏసీపీ సతీష్ జెండా ఊపి సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు అభిలాష్, విజయభాస్కర్, డిస్ట్రిక్ సైక్లింగ్ అసోసియేషన్ సెక్రటరీ శ్రీనివాస్, పీఈటీ టీచర్లు ఐలయ్య, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్, రాజిరెడ్డి, విద్యార్థులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'స్వభావ్, సంస్కార్ స్వచ్ఛత'లో భాగస్వాములవ్వాలి

● ఎన్‌ఎస్ఎస్ కో ఆర్డినేటర్

ములుగు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్వభావ్ స్వచ్ఛత, సంస్కార్ స్వచ్ఛతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనిధి సూచించారు. అటవీ కళాశాల, పరిశోధన సంస్థ(ఎఫ్‌సీఆర్ఐ) ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్వభావ్ స్వచ్ఛత, సంస్కార్ స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం మేడ్చల్ మల్కాజ్‌గిరిలోని శామీర్‌పేట చెరువులో వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో 70 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.



శామీర్‌పేట చెరువులో చెత్తను తొలగిస్తున్న వలంటీర్లు

ఉపాధ్యాయుల కోసం పోరాడేదే 'పీఆర్టీయూ'

దుబ్బాక, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలతోపాటు విద్యావిధానం మెరుగుపరిచేందుకు పోరాటం చేసే ఏకైక సంస్థ పీఆర్టీయూ టీఎస్ అని ఆ సంఘం ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా అధ్యక్షుడు మల్లుగారి ఇంద్రసేనారెడ్డితో కలిసి, ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని వివిధ పాఠశాల్లో పర్యటించారు. ఆయనవెంట పల్లె శ్రీనివాస్‌గౌడ్, ఆకుల లక్ష్మన్, బుచ్చిబాబు, తదితరులున్నారు.

తల్లిదండ్రులు, అధ్యాపకుల ప్రోత్సాహంతోనే విద్యార్థులకు ఉత్తమ భవిష్యత్తు

● గజ్వేల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

గజ్వేల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు తల్లిదండ్రులు, అధ్యాపకుల ప్రోత్సాహంతోనే ఉన్నత భవిష్యత్తు లభిస్తుందని గజ్వేల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గజ్వేల్ పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోని బాలుర జూనియర్ కళాశాలలో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడకుండా చదువు విషయంలో శ్రద్ధ తీసుకునేలా లెక్చరర్లతో పాటు తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. అందరి ప్రోత్సాహంతోనే విద్యార్థులు మంచి భవిష్యత్తును పొందగలుగుతారన్నారు. ఈ సమావేశంలో అధ్యాపకులు వెంకటరమణ, రాజిరెడ్డి, ప్రకాష్, హస్టల్ వార్డెన్ దేవిదాస్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.